

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పొలమే ఒక కాన్వాస్..

» సుదర్శన చక్రం, విజిటింగ్ కార్డు ఆకారంలో నాట్లు

మోపాల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని గూపన్‌పల్లిగ్రామానికి చెందిన చిన్ని కృష్ణుడు 45రకాల వరి వంగడాలతో సుదర్శన చక్రం, విజిట్‌కార్డు ఆకారంలో నాట్లు వేసిన క్షేత్రాన్ని శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేకల గోవింద్, నిజామాబాద్ రూరల్ సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణ, మండల వ్యవసాయశాఖ అధికారి హీరాజాదవ్, స్వాతిలత సందర్శించి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం పట్ల చిన్నికృష్ణుడు చూపుతున్న ఆదరణను వారు అభినందించారు. కొన్నేళ్ల నుంచి చిన్నికృష్ణుడు ప్రకృతి వ్యవసాయం పంటలు పండించడం అభినందనీయమన్నారు. వీరితో పాటు శ్రీసాయి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కేశాపూర్ విద్యార్థులు, డీజీఎస్ డబ్ల్యుఆర్‌డీసీ విద్యార్థులు సందర్శించారు. చిన్నికృష్ణుడు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలూర్ గ్రామ రైతు సంతోష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

10న జాతీయ అప్రెంటీస్ మేళా

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ శాంతారామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్‌లోని ప్రభుత్వ ఐటీఐ మైనార్టీ కళాశాలలో ఈమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ అప్రెంటీస్ మేళాకు ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, డిజిల్‌మెకానిక్, ఐటీఐ ఇతరట్రేడ్‌లలో పాసైన విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. ఈ మేళాకు వరుణ్ మోటార్స్, టాటామోటార్స్, రుద్రా మోటార్స్, బజాజ్ వంటి కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ ధృవపత్రాలు, ఫొటోలు వెంట తెచ్చుకోవాలని కోరారు.





» తమను పోలీసులు వేధించారని కుటుంబ సభ్యుల ఆరోపణ

» ఒక్క ఘటనతో రెండు కుటుంబాలు రోడ్డుపైకి...

» విచారణపై అనుమానాలు

» సీసీఎస్‌లో ప్రక్షాళన బదిలీలకే పరిమితమా?

రియాజ్ ఎన్‌కౌంటర్ వెనుక ప్రశ్నలెన్నో?

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రౌడీషీటర్ రియాజ్ ఎన్‌కౌంటర్ విషయంలో ఇంకా అనేక ప్రశ్నలకు జవాబులు దొరకడంలేదు. సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసి పారిపోయిన రియాజ్‌ను గాలించి పట్టుకునే క్రమంలో అతడికి గాయాలయ్యాయని పోలీసులు పేర్కొంటున్నారు. జిల్లాకేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో ఏఆర్ కానిస్టేబుల్ నుంచి గన్‌ను లాక్కుని తప్పించుకునే ప్రయత్నం చేశాడని తెలిపారు. ఈ క్రమంలో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో రియాజ్ మృతిచెందినట్లు తెలిపారు. కానీ రియాజ్ కుటుంబ సభ్యులు మాత్రం ఎన్‌కౌంటర్ బూటకమని, పోలీసులు తమను వేధింపులకు గురిచేశారని ఆరోపిస్తున్నారు.

నిజామాబాద్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రియాజ్ ఎన్‌కౌంటర్‌పై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసుల తీరుపై అనేక ఆరోపణలు చేశారు. రియాజ్‌ను పట్టుకునే క్రమంలో పోలీసులు రియాజ్ కుటుంబ సభ్యులను వేధింపులకు గురిచేసినట్లు ఫ్యాక్ట్ కమిటీ ఆరోపించారు. రియాజ్ భార్య, తల్లి, పిల్లలపై కఠినంగా పోలీసులు వ్యవహరించారని ఫ్యాక్ట్ కమిటీ సభ్యులు ఆరోపించారు. రియాజ్ ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంటుగా పనిచేసేవాడని తెలిపింది. ఆసిఫ్ అనే వ్యక్తి స్కూటీని జప్తు చేయగా ఆ స్కూటి డిక్కీలో 3లక్షల దొంగనోట్లు దొరికాయని తెలిపారు. వాటిని మార్చుకునేందుకు రియాజ్ పలువురి దగ్గర ఆన్‌లైన్‌లో అప్పు తీసుకుని నకిలీ నోట్లను మార్చుకున్నాడని పేర్కొన్నారు. ఈ విషయంలో ఆసిఫ్‌కు రియాజ్‌కు మధ్య గొడవ జరిగిందని సహాయం కోసం కానిస్టేబుల్ ప్రమోద్‌ను సంప్రదించి తమను కాపాడాలని రియాజ్ వేడుకున్నాడని ఫ్యాక్ట్ కమిటీ ఆరోపించింది.

ప్రమోద్ ఒక్కడే ఎందుకు వెళ్లాడు..

40 కేసులున్న రియాజ్‌ను పట్టుకునేందుకు సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ ఒక్కడే వెళ్లడంపై సీసీఎస్ పోలీసుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. పోలీసుల రికార్డుల్లో రియాజ్ అత్యంత ప్రమాదకారి అని పేర్కొన్నా, అప్పుడే హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రమోద్ ఒక్కడినే పంపడం వల్లే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రమోద్‌తో పాటు ఆయన అల్లుడిని తీసుకుపోగా రియాజ్ దాడిలో అతను కూడా గాయపడ్డాడు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ, ఇతర సిబ్బంది ఉన్నా ఒక్క ప్రమోద్‌నే పంపడంపై విమర్శలు వస్తున్నాయి.

విచారణ ప్రారంభం..

ఒకవైపు రియాజ్ కుటుంబ సభ్యులు పోలీసులు తమను వేధించారని ఇదివరకే డీజీపీకి ఫిర్యాదు చేయగా ఇప్పుడు ఫ్యాక్ట్ కమిటీ ఆరోపణలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అసలు రియాజ్ ఎన్‌కౌంటర్‌పై విచారణ అధికారిగా నియమితులైన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు ఇప్పటికే విచారణ ప్రారంభించగా, విచారణ ఎప్పుడు పూర్తవుతుందో నివేదిక ఎప్పుడు ఇస్తారనేది తేలాల్సి ఉంది.

బాధితులుగా రెండు కుటుంబాలు..

సీసీఎస్ పోలీసులు ప్రమోద్ హత్య జరిగిన రోజు వర్నిలో మరో వ్యక్తిని మిగతా 8వ పేజీలో..



సీఎంను కలిసిన సుదర్శన్‌రెడ్డి దంపతులు

సీఎంను కలిసిన సుదర్శన్‌రెడ్డి దంపతులు

» ప్రభుత్వ సలహాదారుడిగా నియమించినందుకు సీఎంకు జిల్లా నాయకుల కృతజ్ఞతలు

నిజామాబాద్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రప్రభుత్వ సంక్షేమ పథకాల సలహాదారుడిగా క్యాబినేట్ హోదాతో కూడిన పదవిని ఇచ్చినందుకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దంపతులు శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులను కలిసారు. ఈ సందర్భంగా సీఎంకు సుదర్శన్‌రెడ్డి పుష్పగుచం అందజేశారు. అనంతరం జిల్లాకు చెందిన నాయకులు సీఎంను కలిసి సుదర్శన్‌రెడ్డికి ప్రభుత్వ సలహాదారుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డిని సీఎంతోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, నాయకులు సునిల్‌రెడ్డి, నగేష్ రెడ్డి, తదితరులు సన్మానించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సరళ మహేందర్‌రెడ్డి

నగరంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వెన్షన్

» మూడు రోజుల పాటు నిర్వహణ

ఇందూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈనెల 26, 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వెన్షన్ ఆహ్వాన సంఘం అధ్యక్షురాలు సరళ మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రవి పబ్లిక్ స్కూల్ ఆవరణలో కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా గర్ల్స్ కన్వెన్షన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రజనికాంత్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలకు జిల్లా వేదిక కానుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిపిక, నాయకులు రాజు, బాలమణి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

గల్ఫ్ ఏజెంట్లతో జాగ్రత్త

» బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధం

» నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య

సుభాష్‌నగర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ ఏజెంట్లు అనధికారికంగా వ్యాపారం నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. జిల్లాప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు ఇళ్లు అద్దెకు ఇచ్చేముందు జాగ్రత్త వహించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, ఈ చర్యలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు ఉంటాయని తెలిపారు. డ్రోన్‌ల వినియోగంపై ఆంక్షలు ఉన్నాయని, డ్రోన్‌ల వాడకంతో ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఊరేగింపు సభల నిర్వహణ పరిమితులకు మించి శబ్దం చేయవద్దని సూచించారు. 500 మందితో కూడిన సమావేశాలు, సభలు నిర్వహించేందుకు ఏసీపీ అనుమతి తప్పనిసరని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా విగ్రహాలు ఏర్పాటు చేయొద్దని, దీనికి కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండి లక్ష్యాన్ని సాధించాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాన్ని సాధించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల మైదానంలో శనివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి మండలస్థాయి బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీపోటీలను జ్యోతి ప్రజ్వలన చేసిసీపీ సాయిచైతన్య ప్రారంభించారు. ఉమ్మడి మండలంలోని 25పాఠశాలల విద్యార్థులు సీపీకి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సెల్ ఫోన్లలో అనుమానిత మిగతా 8వ పేజీలో..



ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల అవుతున్న నీరు

జల కోలాటం..

» ఎస్సారెస్పీలోకి 56వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» 16 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

» నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 35,105క్యూసెక్కుల వరద రాక

మెండోర/ నిజాంసాగర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 56వేల 513 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరగా 36 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. శనివారం ఉదయం ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద తగ్గడంతో 16వరద గేట్ల ద్వారా 47వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కుల, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు, మిషన్ భగీరథ 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం 1091 అడుగుల మిగతా 8వ పేజీలో..

కొను‘గోడు’ 7

» ధాన్యం కొనుగోళ్లపై ఏఈవోల పనితీరుపై నీలినీడలు

» అధికారుల అలసత్వంపై పెదవి విరుస్తున్న రైతులు

» అధికారులు పర్యవేక్షించాలంటున్న అన్నదాతలు

అయ్యో దేవా..! 8

» అభివృద్ధికి నోచుకోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం

» భక్తులకు అందని సౌకర్యాలు, దాతల విరాళాల నిరాకరణ

» తొలి ఏకాదశి రోజు కోనేరు గేటుకు తాళం

గాలికుంటును తరిమేద్దాం

» 2030 వరకు లేకుండా చేస్తాం

» జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రోహిత్‌రెడ్డి



శెట్‌పల్లిలో గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని సందర్శించిన జేడీ

మోర్తాడ్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధిని 2030 వరకు భారతదేశం నుంచి తరిమేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో శనివారం ఉచిత గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ శిబిరంలో 113 ఆవులు, గేదెలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పాడి రైతులతో రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వ సహకారంతో 2030 వరకు గాలికుంటువ్యాధి లేకుండా చేయడానికి కూడుకుందని అన్నారు. అందులో భాగంగా ఏడాదికి రెండుసార్లు పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేస్తున్నామని అన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు జ్వరంతో కాళ్లకు పుండ్లు అయి గడ్డి మేయదని వివరించారు. పాడిరైతులు పశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వాలు ఇస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ గౌతమ్‌రాజ్, వైద్యసిబ్బంది తైసిన్, ప్రభాకర్, ప్రభాస్, రైతులు సాగర్, నవీన్, సంతోష్, ముత్యం, శేఖర్ పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి

» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు ముఖ్యఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు. మొదట కేటగిరి "ఎ" జాబితాను బీఎల్‌వో యాప్ ద్వారా నిర్ధారించుకోవడం మిగతా 8వ పేజీలో..

15న స్పెషల్ లోక్ అదాలత్

» రాజీపడదగిన 1,328 క్రిమినల్ కేసుల గుర్తింపు

» జిల్లా ప్రధాన న్యాయాధికారి జీవీఎన్ భరత లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జీవీఎన్ భరతలక్ష్మి

నిజామాబాద్‌లీగల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రజల విస్తృతప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ ఈనెల 15న కోర్టు ప్రాంగణాల్లో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా ప్రధానన్యాయాధికారి, జిల్లాన్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎన్ భరత లక్ష్మి తెలిపారు. కోర్టు ప్రాంగణంలోని తన చాంబర్లో నిజామాబాద్ పోలీస్‌కమిషనర్ సాయి చైతన్య, న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ బాస్కర్ రావుతో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజీ పడదగిన 1,328 క్రిమినల్ కేసులను గుర్తించామని, వాటికి లోక్‌అదాలత్ బెంచ్‌లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. విభేదాలు వచ్చినప్పుడు సర్దుకుని రాజీమార్గంలో వెళ్లడమే ఉత్తమమని పేర్కొన్నారు. ఆర్మూర్, బోధన్ కోర్టు ప్రాంగణాలతోపాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ కమిషనర్ సాయిచైతన్య మాట్లాడుతూ స్పెషల్ లోక్‌అదాలత్‌కు పోలీసుశాఖ సంపూర్ణ మద్దతు ఇస్తూ, మిగతా 8వ పేజీలో..

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్ష

» అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సమావేశం

» పాల్గొన్న కలెక్టర్, సీపీ

» కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి పరామర్శ



కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై రాష్ట్ర షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సమీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డు కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా మిగతా 8వ పేజీలో..

క్రైం సమాచారం

వరుసగా మహిళల హత్యల కలకలం

▸▸ నవీపేట మండలంలో 10 రోజుల్లో రెండు హత్యలు

నవీపేట,నవంబరు1(ఆంధ్రజ్యోతి): నవీపేట మండలంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. మిట్టాపూర్ శివారులో శనివారం ఉదయం గుర్తు తెలియని మహిళ మొండెం లభ్యమైంది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, స్థానికుల కథనం ప్రకారం.. నవీపేట, బాసర ప్రధాన రహదారి పక్కన మిట్టాపూర్ శివారులో ఖాళీగా ఉన్న స్థలంలో 25 ఏళ్ల వయసున్న వివస్త్రగా ఉన్న మహిళ మొండెం లభ్యమైంది. మృతురాలికి సంబంధించిన తల, కుడిచేతి మణికట్టు, ఎడమ చేతి వేళ్లను దుండగులు నరికి వేసి వాటిని మాయం చేశారు. మహిళ దుండగులు లైంగికదాడికి పాల్పడిన అనంతరం ఆమెను చంపి వేసి ఉంటారని భావిస్తున్నారు. ఎక్కడో చంపి వేసి మొండెంను ఇక్కడ పడేసి ఉంటారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలాన్ని శనివారం ఉదయం నిజామాబాద్ సీపీ సాయి చైతన్య, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నవీపేట ఎస్ఐ తిరుపతి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సభ్యులు పలు ఆధారాలను సేకరించారు. మృతురాలి తల, చేతి మణికట్టు, మరో చేతి వేళ్ల సమీపంలో ప్రాంతంలో ఉన్నాయా అన్న అనుమానంతో పోలీసులు డ్రోన్ సహయంతో గాలించినప్పటికీ వాటి ఆచూకీ లభించలేదు. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు 10 టీమ్‌లను రంగంలోకి దించారు. సమీప గ్రామాలలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మహిళ మొండెంను పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

10 రోజుల వ్యవధిలో ఇద్దరు..

గత నెల 24న నవీపేట, బాసర ప్రధాన రహదారి పక్కన నాగేపూర్ శివారులో మండలంలోని మద్దెపల్లికి చెందిన శ్యామల లక్ష్మి(45) దారుణ హత్యకు గురైంది. లక్ష్మిని దుండగులు పెట్రోల్ పోసి కాల్చి చంపారు. శ్యామల లక్ష్మిని హత్య చేసిన నిందితులు మిట్టాపూర్ శివారులో మరో మహిళను హత్య చేసిన నిందితులు ఒక్కరేనా, కాదా అనే విషయంపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. 10 రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురి కావడం కలకలం రేపుతుంది.

అప్పుల బాధతో ఆత్మహత్య

తాడ్వాయి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య(45) అప్పుల బాధతో ఆత్మహత్య చేసు కున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. బుధవారం తన పొలం వద్ద పొలానికి వాడే మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య రాజవ్వ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నామన్నారు.

చంద్రశేఖర్ కాలనీలో దొంగతనం

మోపాల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి గురుచరణం ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న తులంన్నర బంగారం, 500 గ్రాముల వెండి, 2వేల నగదును గుర్తుతెలియని దొంగలు దోచుకుపోయినట్లు రూరల్ ఎస్సై ఆరీఫ్ తెలిపారు. గురుచరణం ఇంటికి తాళం వేసి శ్రీలంకకు టూర్‌కు వెళ్లగా, దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

బాన్సువాడలో వ్యక్తి అదృశ్యం

బాన్సువాడటౌన్ , నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం పట్టణంలో జరిగింది. ఎస్‌హెచ్‌వో శ్రీధర్ కథనం ప్రకారం.. పట్టణంలోని 2బీహెచ్‌కే కాలనీకి చెందిన భూమవరం ప్రవీణ్‌గౌడ్ కొన్ని రోజుల నుంచి మానసిక స్థితి బాలేక ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టపక్కల వెతికినా జాడ తెలియలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేశారు. ఛామనఛాయ రంగులో ఉంటాడన్నారు. ఎరుపు షర్టు, నలుపు ప్యాంటు ధరించి ఉంటాడని, ఆచూకీ తెలిస్తే బాన్సువాడ పోలీస్‌స్టేషన్లో సమాచారం అందించాలన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రెంజల్,నవంబరు1(ఆంధ్రజ్యోతి): అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకుని మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. హంగర్గ నుంచి నీలా శివారు మీదుగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం పట్టుకొని, టిప్పర్ యజమాని ఇసార్ ఖాన్, డ్రైవర్ మహ్మద్‌పై కేసు నమోదు చేశామన్నారు.

గంజాయి స్వాధీనం

కామారెడ్డి రూరల్, నవంబరు 01 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండల శివారులో శుక్రవారం 220 గ్రాముల గంజాయి పట్టుకొని సరఫరా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని దేవునిపల్లి ఎస్సై భూవనేశ్వర్ తెలిపారు. హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన కాసమల్ల రాకేష్ మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

హద్దులు దాటేస్తున్నారు


లారీని పట్టుకున్న అధికారులు

సాలూర,నవంబరు1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి తెలంగాణ మీదుగా ఇతర ప్రాంతాలకు వరి ధాన్యం తరలిస్తున్న లారీని రెవెన్యూ, పోలీసు,వ్యవసాయ అధికారులు శుక్రవారం సాలూర శివారులో పట్టుకున్నారు. ధాన్యం ప్రభుత్వ నియమాలను అనుసరిస్తూ ఉన్నాయా లేవా అని పరిశీలించారు. పచ్చి ధాన్యం ఉండటంతో వారిని మందలించి వెనక్కి పంపించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణకు తరలిస్తే చర్యలు తీసుకోవడంతో పాటు భారీగా జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు.

నాలుగు సంచుల ధాన్యం చోరీ

నాగిరెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపల్లికి చెందిన రైతు చింతలపల్లి రాజు వరి ధాన్యం సంచుల్లో నింపి ఉంచగా శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు సంచుల వడ్లను దొంగిలించుకుపోయినట్టు ఇంచార్జి ఎస్‌హెచ్‌వో మనోహర్ రావు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.


స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

ముప్కాల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): బాల్కొండలోని కృషవేణిఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యాబోధనచేశారు. విద్యాబోధన తీరును ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిశీలించి ఉత్తమ విద్యార్థులను ఎంపికచేసి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ విజయకర్తన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీభాషితలో విద్యార్థులకు శిక్షణ


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రతిమ

ఆర్మూర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లోని శ్రీభాషిత పాఠశాలలో శనివారం ఉన్నత విద్యామండలి వారి ఇంగ్లీష్ ఆల్గోరిథంపై ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఇంగ్లీష్ ఆల్గోరిథం పుస్తక ఉపయోగాలను ప్రిన్సిపాల్ ప్రతిమ చావ్లా వివరించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లోకి వెళ్లి పీడీఎఫ్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పాఠశాల కరస్పాం డెంట్, నిజామాబాద్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు పోలపల్లి సుందర్ మాట్లాడు తూ.. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, ఉద్యోగులకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకునేందుకు ఈ పుస్తకాన్ని విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తయారుచేశారన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

కోటగిరి,నవంబరు1(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం త్వరితగతిన తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటి వరకు ఎంత మేరకు ధాన్యం కొనుగోలు చేశారని, సహకార సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు సైతం ధాన్యం అన్‌లోడింగ్ త్వరగా చేసుకోవాలన్నారు. అనంతరం బాబురావు మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, తహసీల్దార్ గంగాధర్ తదితరులున్నారు.

ఓంకార జపంతో స్వామివారి అనుగ్రహం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భీమ్‌గల్,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రం లింబాద్రి గుట్టపై బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం హోమము, ఏకాక్షరి హవనం కార్యక్రమాలను ఆలయ అర్చకులు నంబి పార్థసారథి, విజయసారథిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో లింబాద్రి గుట్టపై నిర్వహించే ఉత్సవాలలో ఏకాదశి రోజు చేపట్టే ఈ కార్యక్రమంలో అర్చకులు ఉపవాస దీక్షలతో ఓం అనే అక్షరాన్ని జపిస్తూ స్వామివారిని వేడుకొన్నారు. ఇలా జపించడం వలన సకల జనుల కోరికలు నెరవేరి స్వామివారి అనుగ్రహం కలుగుతుందని అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు.

స్వామివారిని దర్శించుకున్న డీఎంహెచ్‌వో..


డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న సర్వ సమాజ్ కమిటీ ప్రతినిధులు

భీమ్‌గల్ ప్రాంతానికి చెందిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ కుటుంబ సమేతంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. అనం తరం ఆలయ అర్చకులు, భీమ్‌గల్ సర్వ సమాజ కమిటీలు సన్మానించారు. ఈమె వెంట పీహెచ్‌సీ వైద్యుడు అజయ్ పవర్, సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవి, హరీష్, మోహన్, నవీన్ పాల్గొన్నారు.


బక్కి వెంకటయ్యను సన్మానిస్తున్న మంగి రాములు మహరాజ్

పలుగుట్ట ఆలయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు

నందిపేట , నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో (పలుగుట్ట) శనివారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన బక్కి వెంకటయ్యను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోమన్‌పల్లి రాజన్న, నందిపేట అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బొర్రొల్ల సురేష్, దళిత సంఘం నాయకులు ఎర్రటి మోహన్, ద్యాగరి జీవన్, తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడితో జిల్లా ప్రముఖులు


సీఎం రేవంత్‌రెడ్డితో సుదర్శన్‌రెడ్డి, పలువురు నాయకులు

సీఎంను కలిసిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్, నవంబర్ 1, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల సలహాదారుడిగా క్యాబినెట్ హోదాతో కూడిన పదవిని ఇచ్చినందుకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, జిల్లానాయకులు శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డిని సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, నాయకులు సునీల్‌రెడ్డి, నగేష్‌రెడ్డి తదితరులు సన్మానించారు.

నవీపేట: సీఎం రేవంత్ రెడ్డిని శనివారం ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో బోధన్‌నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సీఎంను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు శ్రీనివాస్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నందిపేట విద్యార్థులు


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నందిపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ గీతా కాన్వెంట్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రెంజర్ల శ్రీవల్లి, షేక్ సోఫియాన్ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లాకేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఇరువురు విద్యార్థులు ప్రథమస్థానం పొందారు. శ్రీవల్లి, షేక్ సోఫియాన్లు ఈ నెల 2., 3, 4 తేదీలలో వరంగల్‌లో జరుగనున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ విద్యార్థులను శనివారం పాఠశాల కరస్పాండెంట్ గంగసాగర్, హెచ్‌ఎం గంగభూషన్, డైరెక్టర్ శోభ, పీఈటీలు ముత్యం, సుమలత, లిఖిత, సందీప్ అభినందించారు.

జోనల్‌స్థాయి ఎంపికలు..

కమ్మర్‌పల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆవరణలో శనివారం జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక జరిగినట్లు కన్వీనర్ సాయన్న తెలిపారు. అండర్ 14 కబడ్డీ, అండర్17 వాలీబాల్ క్రీడాకారుల ఎంపికను ఆయన ప్రారంభించగా.. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాలకు చెందిన వివిధ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియ పీడీ వేముల నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించారు. పీఈటీలు ఆనంద్, శ్యాం, నగేష్, మాధురి, గోపాల్, రమేష్‌గౌడ్, బాలు, సంజీవ్, ప్రేమ్‌కుమార్, సుమన్ పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో నిర్వహించిన క్రీడల్లో ఎంపికైన వారితో కన్వీనర్, పీఈటీలు

ఖోఖో క్రీడలో..


పచ్చలనడ్కుడలో జిల్లాస్థాయికి ఎంపికైన ఖోఖో క్రీడాకారులు

వేల్పూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భీమ్‌గల్ జోనల్ స్థాయి ఖోఖో క్రీడాకారుల జట్లు ఎంపికలు నిర్వహించారు. హెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో పీడీ గంగాధర్ పర్యవేక్షణలో అండర్14, అండర్17 జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయిలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీలు గంగాధర్, రాజేందర్, సురేష్, చిన్నయ్య, భూపతి, గీతా, సత్యనారాణ, సుమన్, దిలిప్, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.


ముప్కాల్‌లో ధర్నా నిర్వహిస్తున్న వీడీసీ సభ్యులు

ఎక్సైజ్ అధికారులకు వ్యతిరేకంగా రాస్తారోకో

ముప్కాల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కల్లు అమ్మకంలో ఒక వర్గానికి సపోర్టు చేస్తున్నారని ఆరోపిస్తూ ఎక్సైజ్ అధికారులకు వ్యతిరేకంగా వీడీసీ సభ్యులు శనివారం ముప్కాల్ పాత జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఎక్సైజ్ సీఐ రావాలంటూ.. సీఐ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కల్లు అమ్మకంలో ఎక్సైజ్ అధికారుల ప్రమేయం ఏంటని ప్రశ్నించారు. గ్రామంలో కొన్నేళ్లుగా రెండు వర్గాల గీతా కార్మికులు రెండు కల్లు దుకాణాలు నడుపుతున్నారని, అందరై రూ.పది చొప్పునే అమ్మకాలు కొనసాగించాలని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. ఒక వర్గం వారు రూ.10 అమ్ముతుండగా.. ఇంకో వర్గం వారు రూ.15కు అమ్ముతామని నిర్ణయించారు. తక్కువ రేటుకు అమ్ముతున్న తమను ఎక్సైజ్ పోలీస్‌లు భయబ్రాంతులకు గురి చేస్తున్నారని వీడీసీ దృష్టికి తీసుకెళ్లగా ఇరు వర్గాల సమస్యను పరిష్కరిం చాలంటూ ధర్నా చేశారు. దీంతో స్థానిక పోలీస్‌లు ఎంత సముదాయించిన పట్టువిడువక పోవడంతో ఎక్సైజ్ పోలీసులు వచ్చి, తమ ప్రమేయం లేదని సమస్య పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరబాద్ గ్రామంలో శనివారం ఉపాధి హామీ పనులను అంతర్గత ఆడిటర్లు, బృంద అధికారులు సందర్శించి పనులను తనిఖీ చేశారు. 2022-25 వరకు గ్రామాల్లో జరిగిన ఈత వనాలను చెరువు కట్టలపై నాటగా వాటిని పరిశీలించారు. క్రీడా ప్రాంగణాలను, నర్సరీలను పంచాయతీ రాజ్ శాఖ కింద చేపట్టిన సీసీరోడ్ల పనులను బృందం అధికారులు స్మిత వెంకటపతిరాజు, శ్రీనాథ్ పరిశీలించారు. గ్రామాలలో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, పంచాయితీ కార్యదర్శులు రాకేష్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధిహామి సిబ్బంది ఉన్నారు.


పడకల్‌లో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

రూ.30 వేల పరిహారం అందించాలి

ఆర్మూర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. అకాల వర్షాలతో ధాన్యం తడిసి, పంట నీటమునిగి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారన్నారు. ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలోని వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భూమన్న, జన్నపల్లి నడ్పి రాజన్న, సాయిలు, కుల్దీప్ శర్మ, రవి, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెంజల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం వల్ల పంటనష్టం జరిగి తీవ్రంగా నష్టపోయిన రైతులకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు పుట్టి నాగన్న అన్నారు. శనివారం సంఘం నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని 20శాతం తేమ ఉన్నా కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతాంగానికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఐకేపీ, సహకార సంఘాల ద్వారా ధాన్యంతో పాటు సోయాబీన్ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. నాయకులు గుమ్ముల గంగాధర్, పార్వతి రాజేశ్వర్, నసీర్, ఒడ్డెన్న, సిద్ద పోశెట్టి, ఎల్ గంగాధర్, తరుణ్, నాగుల లక్ష్మణ్, జబ్బర్ పాల్గొన్నారు.


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

మైనంపల్లి జన్మదిన వేడుకలు

నవీపేట,నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో శనివారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైనంపల్లి సేవ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు.

సామూహిక వ్రతాలు

ఎడపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలిఏకాదశి సందర్భంగా శనివారం జానకంపేట శివారులోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయా నికి భక్తులు పోటెత్తారు. కార్తీక దీపోత్సవం, సామూ హిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంత రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

రైతు అభ్యున్నతే సర్కార్ ధ్యేయం

మెండోర, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రైతు అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కారు పనిచేస్తుందని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బుస్సాపూర్, సావెల్, వెల్లటూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాయిరెడ్డి, మహిపాల్, ఆర్ఐ వేణు గోపాల్ చారి, నాయకులు రాజేందర్, శ్రీనివాస్, తిరుపతి, లక్ష్మణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న పల్లకీ సేవ

జక్రాన్‌పల్లి,నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వెంకటేశ్వర స్వామి ఉత్సవాలను భక్తులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. అనంతరం స్వామివారి పల్లకీని కొండపై చుట్టూ ప్రదక్షణలు చేయించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సం జీవ్ గౌడ్, బ్రాహ్మణ్‌పల్లి సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి, భక్తులు, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గది ప్రారంభం

భీమ్‌గల్ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్కూర్ గ్రామంలోని ప్రాథమిక మండల పరిషత్ నిధులు రూ.1.05 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదిని శనివారం ఎంపీడీవో సంతోష్ కుమార్ ప్రారంభించారు. ఎంఈవో స్వామి, సొసైటీ చైర్మన్ దేవేందర్, పంచాయితీ రాజ్ ఏఈ విక్రమ్ పాల్గొన్నారు.

గ్రామ ఏర్పాటుకు వివరాల సేకరణ

ఏర్గట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచంద గ్రామంలోని ఎస్సీ వాడ ఇందిరమ్మ ఇళ్లలో ఉంటున్న స్థానికులు, బీసీ కాలనీలను కలిపి నూతన గ్రామంగా ఏర్పాటుచేయాలని ఇటీవలే కాలనీ వాసులు జిల్లా అధికారులకు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం డీఎల్‌పీవో శివ కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు కాలనీవాసుల అభిప్రాయాలు సేకరించారు. సమాచారాన్ని పై అధికారులకు నివేదిస్తామన్నారు. ఎంపీవో శివచరణ్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని కడ్తా లేకుండా కొనుగోలు చేయాలి

భీమ్‌గల్ రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని కడ్తా లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గోన్‌గొప్పుల, బడా భీమ్‌గల్, పురాణిపేట్ గ్రామాల్లో పర్యటించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. నష్టం తీవ్రత గురించి తెలుసుకున్నారు.

నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ

బోధన్,నవంబరు1(ఆంధ్రజ్యోతి): బోధన్ మునిసిపాలిటీలోని వాటర్‌వర్క్ విభాగంలో నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలపై శనివారం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ వరంగల్ షాహీద్ మసూద్ హుస్సేన్ విచారణ చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణను,ఫిర్యాదుదారుడు జునైద్ హైమద్‌ను విచారించారు. అనంతరం పలు రికార్డులను విచారణ నిమిత్తం తీసుకువెళ్లారు. రికార్డుల పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఆర్మూర్ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘీక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించా రు. హైదరాబాద్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజన్ ఆధ్వర్యంలో చిన్న పరిశ్రమలకు లోన్ ఏవిధంగా తీసుకోవాలి, మార్కెటింగ్ నిర్వహణ అంశాలపై, మ్యాజిక్ బాస్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. సోహం అకాడమి ఆఫ్ హుమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్ అకాడమీ భౌతిక శాస్త్రం విద్యార్థులకు రోబోటిక్స్ ప్రాథమిక సిద్ధాంతాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టులపై పనిచేసే విధానంలోని నైపుణ్యాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చంద్రిక, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఉత్తమ ఆచార్య సేవా పురస్కారం

రుద్రూరు,నవంబరు1(ఆంధ్రజ్యోతి): రుద్రూరులోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సాయిప్రసాద్ ఉత్తమ ఆచార్య సేవాపురస్కారం అందుకున్నారు. ఢిల్లీలో 2025 భారతశ్రీరత్నం అవార్డు అందుకున్నారు. సర్దార్ వల్ల భాయ్ పటేల్ జయంతి సందర్భంగా అవార్డ్ అందించారు.

ఏఐపై వర్క్‌షాప్

మాక్లూర్,నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఫార్మసుటికల్స్‌లో ఏఐపై ఐదురోజుల వర్క్‌షాప్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డా.సురేష్ తెలిపారు. ఆరోగ్య సంరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఫార్మా నిపుణులు ఏఐ వంటి సాంకేతిక మార్పులను స్వీకరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఫార్మా, సాంకేతికతను అనుసంధానించే నైపుణ్యాలున్న అభ్యర్థులకు పెరుగుతున్న డిమాండ్‌లను వివరించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.శ్రీకాంత్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోవూరు నర్సరీ పరిశీలించిన ఎంపీడీవో

మోస్రా, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవూరు గ్రామ నర్సరీని ఎంపీడీవో సాయికుమార్ శనివారం పరిశీలించారు. మొక్కల అభివృద్ధి బాగుండటంతో కార్యదర్శి రాజశేఖర్‌ను అభినందించారు. పంచాయతీ కార్యాలయంలో రిజిస్ట్రర్లు పరిశీలించారు. ఏపీవో అంబర్ సింగ్, ఎంపీవో వెంకటేశ్వర్లు, మోస్రా కార్యదర్శి శ్రావణ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

పాఠశాలలో పీఎంశ్రీ ఎక్స్‌పర్ట్ టాక్ కార్యక్రమం

మోస్రా,నవంబరు1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తూ జమతుల ఆహారం తీసుకోవాలని పీఎంశ్రీ ఎక్స్‌పర్ట్ టాక్ కార్యక్రమంలో భాగంగా మోస్రా బాపనయ్య నగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం మోస్రా ఆదిత్య హాస్పిటల్ ప్రముఖ ప్రైవేట్ వైద్యురాలు వీవీఎస్ నాగరమ్య ఎంబీబీఎస్ మాట్లాడుతూ విద్యార్థులు పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు.

విద్యుత్ స్తంభానికి మంటలు

బోధన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని సరస్వతినగర్‌లో విద్యుత్ స్తంభానికి మంటలు అలుముకున్నాయి. డిష్ కేబుల్ వైర్లతో షాట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి సుభాష్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. విద్యుత్ శాఖ ఏఈ నాయిని కృష్ణ మాట్లాడుతూ విద్యుత్ స్తంభంపై భాగంలో ఉడత వల్ల ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు.



బీర్కూర్‌లో ధాన్యం తేమ శాతాన్ని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే పోచారం

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

» ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బీర్కూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహా దారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి బీర్కూర్ మండలంలోని దామరంచ, రైతునగర్, అన్నారం, చించోల్లి, కిస్టాపూర్, బీర్కూర్, సాంబాపూర్, బరంగ్‌ఎడ్గీ గ్రామాల్లో పర్యటించారు. ధాన్యం రాశులను పరిశీలించారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసే ప్రమాదం ఉందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాల భారీ నుంచి ధాన్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

సలాబత్‌పూర్ ఆలయానికి పాదయాత్ర



కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి చేరుకున్న భక్తులు

మద్నూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రం నుంచి సలాబత్ పూర్ ఆంజనేయ స్వామి ఆలయానికి ప్రభాత్ ఫేరి భక్తులు శనివారం తెల్లవారుజామున పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ముందుగా రాష్ట్ర సరిహద్దుల్లో గల శివాలయానికి వెళ్లి కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి చేపట్టారు. అనంతరం అంజనేయ స్వామి ఆలయానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం హారతీ మహోత్సవం చేపట్టారు. ప్రతీ సంవత్సరం కార్తీకమాసంలో ప్రభాత్ ఫేరి బృందం భజనలు చేస్తూ సలాబత్పూర్ హనుమాన్ మందిరానికి వెళ్లడం ఆనవాయితీగా వస్తోందని భక్తులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తుల పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల బహూకరణ



బీర్కూర్‌లో విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలను అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత గ్రంథా లను పంపిణీ చేశారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన ఇంటర్ చదివే విద్యార్థులు తాము భగవద్గీత చదువుతామని లయన్స్ అధ్య క్షుడు రమేష్ తెలిపారు. ఈ మేరకు రమేష్ విద్యార్థుల తల్లిదండ్రులను బీ ర్కూర్‌కు ఆహ్వానించి భగవద్గీత గ్రంథాలను బహుమతిగా అందజేశా రు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ లయన్స్ అధ్యక్షులు రమేష్, ట్రెజరర్ గాలయ్య, జోన్ చైర్మన్ కొట్టూరి సంతోష్, సీనియర్ లయన్స్ సభ్యులు విఠల్, రషీద్, సభ్యులు గోపి, ప్రవీణ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలి

● ఎంపీడీవో శ్రీనిధి



దామరంచలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనిధి

బీర్కూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు పారదర్శకంగా, సమర్థవంగా నిర్వహించాలని మండల ఎంపీడీవో శ్రీ నిధి గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ, ఉపాధి హామీ పథకం సంబంధిత రికార్డులను పరిశీలిం చారు. అనంతరం ఉపాధి హామీ కింద లబ్ధిదారులు నిర్మించుకుం టున్న పశువుల కొట్టం పనుల ను ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల నాణ్యత, పథకం అమలు తీరును పరిశీలించి, సిబ్బందికి తగిన సూ చనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో, బాలింత లతో మాట్లాడారు. కేంద్రంలో వారికి అందిస్తున్న పోషకాహార ఆహా రాన్నీ పరిశీలించారు. ఆహార నాణ్యత, రికార్డులు, హాజరు వివరాలను తనిఖీ చేశారు. పిల్లల ఆరోగ్యం పట్ల, పరిశుభ్రత పట్ల మరింత శ్రద్ధ వహిం చాలంటూ సూచించారు. ఆమె వెంట ఏపీఓ అక్మల్, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కాశీరామ్, కరోబార్ దత్తు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

పెద్దకొడప్‌గల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ ఎంపీడీవోగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన అభినవ్ చందర్‌కు శనివారం వైద్య సిబ్బంది సన్మానించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా ఫార్మసీ అధికారి నారాయణ, సంగా రెడ్డి జిల్లా కేంద్రంలో మెడి కల్ అధికారిగా పని చేస్తున్న డాక్టర్ నరేందర్‌లు ఎంపడీవో అభినవ్ చందర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గతంలో అభినవ్ చందర్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వైద్యశాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారని, అనంతరం గ్రూప్ 1 ఫలితాల్లో పెద్ద కొడప్‌గల్ ఎంపీడీవోగా నియమాకమయ్యారని తెలిపారు. అభినవ్ చందర్ రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం

బాన్సువాడ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో బాగంగా శనివారం దేవతల ఊరేగింపుతలో గ్రామమంతా హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితు లు సంతోష్ శర్మ అర్చకత్వంలో హోమ, యజ్ఞ యాగాదుల కార్యక్ర మాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాఅన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వరి రేఖ శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మోహన్‌రడ్డి, అంజయ్య పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

కొను'గోడు'..



రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యం

» ధాన్యం కొనుగోళ్లపై ఏఈవోల పనితీరుపై నీలినీడలు

» అధికారుల అలసత్వంపై పెదవి విరుస్తున్న రైతులు

బాన్సువాడ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వ్యవ సాయ విస్తీర్ణ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు గంటల తరబడి కేంద్రాల్లో వేచి ఉన్నా అధికారులు కనీస పర్యవేక్షణ చేయక పోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అకాల వర్షాల వల్ల పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాల్సిన అధికారులు గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తుల ద్వారా సమాచారాన్ని తెప్పించుకుని పంట నష్ట వివరాలు నమోదు చేయడం పట్ల పలు గ్రామాల్లో ఏఈవోల పనితీరు పట్ల రైతులు నిలదీసినట్లు సమాచారం.

తేమ శాతం విశ్లేషణ కాగితాలకే పరిమితం..

కొన్ని కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేనందున చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల్లో ధాన్యం తేమ శాతం పరిశీలించి విశ్లేషించే నివేదిక అందజేసే విషయంలో ఏఈవోల నిర్లక్ష్యం వహిస్తున్నారని మరికొందరైతే ట్రక్ షీట్‌తో అందజేయాల్సిన తేమ వాతం నివేదిక రశీదులను ఎటువంటి వివరాలు నమోదు చేయకుండానే ఖాళీ రశీదులపై సంతకాలు చేస్తూ చేతుతు దులుపుకుంటూ విధులకు ఎగనామం పెడుతూ రైతులను నష్టపర్చుతున్నారు. మరికొందరు రైస్ మిల్లులలో ధాన్యం అన్‌లోడ్ అయిన తర్వాత 15 రోజులకు రైస్ మిల్లులకు అందజేస్తున్నట్లు సమాచారం.

విధుల పట్ల అలసత్యం కనబరుస్తున్న వ్యవసాయాధికారులు..

సొసైటీల ద్వారా కొనుగోలు కేంద్రాలలో నియమించిన సిబ్బంది చేత కొంతమంది ఏఈవోలు తమకు కావాల్సిన సమాచారంతో పాటు తేమ యంత్రాలతో పరీక్షించే పనులను సైతం వారితోనే చేయించడం వల్ల రైతులు ధాన్యం కొనుగోలు కేం ద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మరికొందరు ఏఈవోలు రైతు వేదికలో అందుబాటులో ఉండకుండా మండల కేంద్రాలు, పట్టణాల్లో ఉంటూ కేవలం ప్రభుత్వ కార్యక్రమాలప్పుడు మాత్రం రైతు వేదికల వద్దకు స్థానిక నాయకులను పిలిపించుకుని మమ అనిపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తడిసిన ధాన్యం సమస్యలపై సకాలంలో సూచనలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అదనపు విధుల పట్ల ఏఈవోల అసహనం

వ్యసాయ విస్తీర్ణ అధికారులుగా తాము చేప ట్టాల్సిన పనులకు అదనంగా అధికారులు విధులు అప్పజెప్పడం వల్ల కొంతమంది ఏఈవోలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ జరిపితేనే రైతులకు మేలు...

రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయానికి సంబంధించి న సేవలను, సలహాలను చేరువగా అందించేందుకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ద్వారా అందించాల్సినవి సకాలంలో అందుతున్నాయి లేదో పర్యవేక్షణ చేయాల్సిన ఉన్నతాధికారులు నామమాత్రపు పర్యావేక్షణ చేయడం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈఈవోల పని తీరుపై పర్యవేక్షణ చేయాల్సి అవసరం ఎంతైనా ఉందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

రేపటి నుంచి అన్ని కళాశాలల బంద్



వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల యాజమాన్యాలు

ఇందల్వాయి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల మనుగడ ప్రశ్నార్థకం అయిందని డబ్బులు రానిపక్షంలో కళాశాలలు నడపడం కష్టమని కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నెల 3వ తేదీ నుంచి అన్ని కళాశాలలను మూసివేయనున్నామని తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్య అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రిజిస్టర్ ఆచార్య యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌లను కలిసి బందుకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జయపాల్ రెడ్డి, నరాల సుధాకర్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాకపోవడంతో కళాశాల నిర్వహణ కష్టం అయిపోయిందని జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని అన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ డబ్బులు విడుదల అయ్యేవరకు కళాశాలలు తెరిచే ఆస్కారం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మారయ్య గౌడ్, శంకర్, గురువేందర్ రెడ్డి, సూర్య ప్రకాష్, శ్రీనివాస్, అరుణ్, గిరి, దత్తు, అనిల్, షకీల్, రషీద్, నవీన్, సత్యం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో విష జ్వరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇందల్వాయి, నవం బరు 1 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు విష జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటు న్నామని అంగన్‌వాడీ టీచర్ శారద పేర్కొన్నారు. శనివారం ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారం తండా గ్రామ పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ సెంటర్‌లోని పిల్లలకు, తల్లి తండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల బరువు, ఎత్తు కొలతలు చూసి ఆరోగ్య పరిస్థితిపై పలు సూచనలు చేశారు. విష జ్వరాలు రాకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, పిల్లలకు పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని పే ర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో వారానికి రెండుసార్లు గుడ్లు, పాలు పౌష్టికాహారం సెంటర్లో అందిస్తున్నామని అన్నారు. పిల్లలను సరైన టైంలో సెంటర్లో వదిలి పెట్టాలని తల్లి తండ్రులకు సూచించారు. బాలింతలు ఆకుకూరలు గుడ్లు, పాలు లాంటి ఆహారాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ శారద, ఆశ వర్కర్ జ్యోతి, బాలింతలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల పరిశీలన



అచ్చయపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నాగిరెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చయపల్లి, ఆత్మకూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను శనివారం స్థానిక ఎంపీడీవో లలిత కుమారి పరిశీలించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో కొన సాగుతుండ డంతో లబ్ధిదారులతో ఆమే మా ట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఇంకా నిర్మాణం చేపట్టలేని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ చారి, పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



విద్యార్థినులకు ప్రాణయామం చేయిస్తున్న యోగా బోధకురాలు

మద్నూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేనూర్ మోడల్ పాఠశాల, కళాశాల వసతి గృహం విద్యార్థినులకు ఆయుష్ యోగ బోధకురాలు జుబ్రే సుప్రియ ప్రత్యేకంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు మానవుడి ఆయుష్షను తగ్గిస్తున్నాయన్నారు.. సర్వం కల్తీమయం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. చిన్న వయస్సులోనే అనేక రుగ్మతలకు లోనవుతున్నారని తెలిపారు.. వీటి నుంచి ఉపశమనం పొందేందుకు యోగ ఆసనాలు ఉత్తమ మార్గమని ఆమె విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. మనిషి తన జీవితంలో ఏ కార్యాన్ని ఆచరించాలన్న తనకున్న గమ్యాన్ని చేరుకోవాలని చెప్పారు. దానికి ప్రధానమైన సాధనం శరీరం, శరీరం లేకపోతే ఇవేమీ జరగవు శరీరం ఆరోగ్య వంతమైనది గా ఉండాలి. అప్పుడే ఇవన్నీ సాధ్యమవుతాయన్నారు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రధాన మార్గం యోగాభ్యాసం, శరీరానికి నిత్యం వ్యాయామం జరగాలన్నారు. కొద్ది సమయం యోగాసనాలు ప్రాణమాయం చేయాలని సూచించారు. దీంతో వసతి గృహం లోని 104 మంది విద్యార్థినులు యోగాసనాలపై ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు యోగా ధ్యానం తర గతులు నిర్వహిస్తున్నామని ఆమె వెల్లడించారు.

లబ్ధిదారులకు చేతి సంచుల పంపిణీ



చిన్న శక్కర్గ రేషన్ షాప్ పరిధిలో బ్యాగులు పంపిణీ చేసిన రేషన్ డీలర్

మద్నూర్, నవం బరు 1 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా ఆహార భద్రతా లబ్ధిదారులకు ప్రత్యేక సామగ్రితో పర్యావరణ రహితంగా గుడ్డ కాగితంతో తయారుచేసిన చిన్న సంచుల్లో బియ్యాన్ని అందించేందుక పౌర సరఫరాల శాఖ ఏర్పాటు చేసింది. ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించడంతో పాటు ఇతర అవసరాలకు వినియోగించు కునేలా తయారు చేయించిన బ్యాగులను ఉమ్మడి మద్నూర్ మండలంలో శనివారం ఆహార భద్రతా లబ్ధిదారులకు మండల రేషన్ డీలర్ అధ్యక్షుడు రమేష్ దేశాయి పంపి ణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారుల కుటుంబంలో సభ్యుడికి ఆరు కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేయనున్న దృష్ట్యా ప్రత్యేక సంచులను తయారు చేసి రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

సీఎం డిప్యూటీ సీఎం ఫొటోలతో

ఆహార భద్రత పథకంలో భాగంగా రేషన్ బియ్యాన్ని అందించే సంచులపై సీఎం డిప్యూటీ సీఎం పౌర సరఫలా శాఖ మంత్రి ఫొటోలు ముద్రించి ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఫోటోలను వస్త్ర సంచులపై ఒకవైపున ముద్రించగా, మరోవైపు హస్తం పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు సంబంధించిన పథకాల వివరాలను ముద్రించారు. మాజీ ప్రధాని ఇందిరా ఫొటో కింద అందరికీ సన్న బియ్యం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం అనే క్యాప్షన్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అని ముద్రించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా రేషన్ షాపుల్లో లబ్ధిదారులందరికీ చేతి సంచులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

సీఎంను కలిసిన ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



సీఎంను కలిసిన ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

మోపాల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫోరం అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి మర్యాధపూర్వకంగా కలిశారు. ముందుగా ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన సుదర్శన్‌రెడ్డిని కలిసి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయాలని కోరారు.

రచయితలే జ్ఞాన వారధులు

» ప్రధానోపాధ్యాయుడు పోశన్న

» సారంగపూర్ పాఠశాలలో ఘనంగా జాతీయ రచయితల దినోత్సవం

మోపాల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తరాలకు తరాలకు మధ్య జ్ఞాన వారధుల రచయితలని, వారు అనుశీలించి, పరిశోధించి, సృజనాత్మకతను జోడించి అందించిన పుస్తకాల వల్లనే జ్ఞానం యుగయుగాలుగా వర్ధిల్లుతుందని సారంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోశన్న అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన జాతీయ రచయితల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, పాఠ్యపుస్తక రచయిత తెలుగు ఉపాధ్యాయులు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ పాఠశాలలో నేర్చుకున్న పాఠాల రచయితల జీవితాలను కూడా విద్యార్థులు చదవాలని అప్పుడే రచయితల యొక్క గొప్పతనం అర్థం అవతుందని అన్నారు. విద్యార్థులు కూడా రచయితలుగా ఎదిగేందుకు దోహదపడుతుందని అన్నారు. గ్రంథాలయ ఉద్యమం చురుగ్గా పాల్గొన్న ప్రఖ్యాత రచయిత వట్టికోట ఆళ్వార్ స్వామి జయంతి ఈరోజు కావడం సముచితంగా ఉందన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్ సల్ల సత్య నారాయణ మాట్లాడుతూ సమాజంలో మార్పుకు కారణం రచయితలేనని తెలిపారు. ఇం గ్లిష్ ఉపాధ్యాయురాలు సునంద మాట్లాడుతు లక్ష మెదళ్లకు కదలికైన సిరాచుక్క అక్షరంగా మార్చే శక్తి రచయితకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ సుంకరి గంగాధర్, లలిత, డి.గోపాల్, జావిద్ హుస్సేన్, విద్యాసాగర్, స్వరూప, సుజాత, అనిత, రంగు కృష్ణంరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న రచయితలు, కవులు

సంక్షిప్త సమాచారం

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

సుభాష్‌నగర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ అరుణాచలంకు ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు నిజామాబాద్ డిపో-1 మేనేజర్ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షణకు డిపో-1 నుంచి సూపర్‌లగ్జరి బస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్ నగర ప్రధాన బస్టాండ్ నుంచి నవంబర్ 3న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి కానిపాకం, వెల్లూరు గొల్డెన్ టెంపుల్, అరుణాచలం, కంచీ, జోగులాంబ, బీచుపల్లి హనుమాన్ టెంపుల్ సందర్శణ అనంతరం 7న నిజామాబాద్ చేరుకుంటుందని తెలిపారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 73828 40367, 94904 10939, 93470 50695 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

ఉచిత ఆరోగ్య శిబిరం



కిష్టాపూర్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బీర్కూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శనివారం మెడికవర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున శిబిరానికి తరలివచ్చారు. ఆరోగ్య సిబ్బంది వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు యూ డైస్‌పై శిక్షణ

పిట్లం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యుడైస్‌పై ఉపాధ్యాయులకు ఎంఈవో దేవిసింగ్ శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో యుడైస్‌లో పొందుపరచాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ హైమద్ పాషా, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ఆపరేటర్లు పాల్గొన్నారు.

జీపీవోల ఇందల్వాయి మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ నియామక పత్రం అందుకుంటున్న సభ్యులు

ఇందల్వాయి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పాలన అధికారి, మండల కమిటీని శనివారం ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా జంగిడి లింబాద్రి, ఉపాధ్యక్షులుగా బి.సాయిలు, గౌరవ అధ్యక్షులుగా విజయ్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి సందీప్, కోశాధికారిగా నీరడి ప్రభాకర్, జాయింట్ కార్యదర్శిగా నీరడి రాజేశ్వర్, సలహాదారులుగా స్వప్న, ప్రమోద్, రవీందర్, రంజిత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన లింబాద్రి మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి సమ స్యల పరిష్కారాల కోసం తనవంతు కృషి చేస్తానని నాపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రియాజ్ ఎన్‌కౌంటర్.. వెనుక ప్రశ్నలెన్నో?

(5వ పేజీ తరువాయి)

పట్టుకునేందుకు వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే రియాజ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చేందుకు ప్రమోద్ ఒక్కడినే అధికారులు పంపినట్లు తెలుస్తుంది. ఇద్దరు కానిస్టేబుల్స్ వెళితే ఈ పరిస్థితి ఉండేదికాదని ఒక్కడే వెళ్లడం వల్లే ప్రమోద్ హత్యకు గురయ్యాడని ఈ విషయంలో పోలీసుశాఖ సీసీఎస్ సిబ్బందిపై ఇప్పటికి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఒక్క ప్రమోద్ హత్య ఘటనతో అటు ప్రమోద్ కుటుంబం, ఇటు రియాజ్ కుటుంబం రోడ్డున పడింది.

సీసీఎస్‌పై ఆరోపణలు..

పోలీసుశాఖలో అత్యంత కీలకమైన సీసీఎస్ విభాగంపై అనేక ఆరోపణలు ఉన్నాయి. సెంట్రల్ క్రైం స్టేషన్‌లో కొంతమంది పోలీసులు నేరస్థులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారు తప్పించుకునేలా సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా దొంగతనాలు, పాత నేరస్థులపై నిఘా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలపై సీసీఎస్ విభాగం పని చేస్తుంది. గతంలోను ఈ విభాగంపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ విభాగంలో పనిచేసే కొంతమంది దాడులు జరగకముందే సమాచారం అందిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

ప్రక్షాళన చేస్తారా...

సీసీగా సాయిచైతన్య బాధ్యతలు చేపట్టిన తర్వాత సీసీఎస్‌లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిని బదిలీ చేశారు. ఇటీవల కానిస్టేబుల్ ప్రమోద్ హత్య తర్వాత ఆ విభాగంపై మళ్లీ ఆరోపణలు వచ్చాయి. శుక్రవారం ఈ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ప్రమోద్ హత్య ఘటనలో ఇతర సిబ్బంది నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం కోల్పోయిన విషయంలో ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేవలం బదిలీలతోనే సరిపెడతారా.. లేక పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తారా అనేది తేలాల్సి ఉంది.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్ష

(5వ పేజీ తరువాయి)

సమస్యలపై బాధితుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అంతకుముందు ఆయన బాధిత సీ.సీ.ఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమోద్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విధి నిర్వహణ సందర్భంగా కానిస్టేబుల్ హత్యకు గురికావడం ఎంతో బాధ కలిగించిందని, బాధిత కుటుంబానికి కమిషన్ అండగా నిలుస్తుందని, పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. ఛైర్మన్ వెంట ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు ఉన్నారు.

రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి

(5వ పేజీ తరువాయి)

జరుగుతుందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించడం జరిగిందని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కేటగిరి సి, క్యాటగిరి డి లలోని ఓటర్లను కేటగిరి ఎ కు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగుపరచాలని తెలిపారు. కాగా, అంతకుముందు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఈ.ఆర్.ఓలు, ఏ ఈ ఆర్ ఓ లు, బీఎల్‌ఓ సూపర్వైజర్లు, బీ ఎల్ ఓలతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ ఐ ఆర్ సన్నాహక ప్రక్రియ పురోగతిపై సమీక్ష జరిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా సరైన పద్ధతిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. 2002 ఓటరు జాబితా, ప్రస్తుత 2025 ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఆదివారం సాయంత్రం లోగా మ్యాపింగ్ పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రతి పోలింగ్‌స్టేషన్ వారీగా ఈ ప్రక్రియను బీఎల్‌ఓ లు సజావుగా పూర్తి చేసేలా బీ ఎల్ ఓ సూపర్వైజర్లు, ఏఈఆర్‌ఓ లు స్వీయ పర్యవేక్షణ.చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

భవిత కేంద్రం పనులు నాణ్యతతో చేపట్టాలి

సుభాష్‌నగర్, నవంబరు 01, ఆంధ్రజ్యోతి: ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఉద్దేశించిన భవిత కేంద్రంలో చేపట్టిన నిర్మాణ పనులను నాణ్యతతో జరిపించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కోటగల్లి శంకర్ భవన్ పాఠశాలలో కొనసాగుతున్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ శనివారం సందర్శించారు. భవిత కేంద్రాల నిర్మాణాలు, మరమ్మతుల కోసం నిధులు అవసరమైన పక్షంలో జిల్లా యంత్రాంగం ద్వారా అదనపు నిధులను కూడా సమకూరుస్తామని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. అనంతరం కలెక్టర్ శంకర్ భవన్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు ముఖ గుర్తింపు విధానంలో అమలు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ విధానంలోనే హాజరు ఉండాలని కలెక్టర్ స్పష్టం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో నిర్వహిస్తున్న కిచెన్, హెర్బల్ గార్డెన్‌ను పరిశీలించి అభినందించారు. కలెక్టర్ వెంట ఇంజినీరింగ్ విభాగం అధికారులు రవి, ఉదయ్ కిరణ్, ఎంఈఓ సాయిరెడ్డి, భవిత కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి ప్రకాష్, సీఎంఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నగరంలో ప్రతీ డివిజన్‌కు రూ.కోటి

▸ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, నవంబర్ 1, (ఆంధ్రజ్యోతి): నగరంలో డివిజన్‌కు కోటి రూపాయలు మంజూరయ్యాయని వాటి టెండర్ ప్రక్రియ పూర్తిచేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త పేర్కొన్నారు. నిజామాబాద్ నగర అభివృద్ధిపై జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో మున్సిపల్, విద్యా, ఆర్‌అండ్‌బీ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. నగరంలో పనిచేయని స్ట్రీట్ లైట్స్‌కు తక్షణమే మరమ్మతులు చేయాలని, పనిచేయని చోట కొత్తవి పెట్టాలన్నారు. పారిశుధ్య పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ బడుల్లో అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలని డీఈవోను ఆదేశించారు. బస్తీ దవాఖానాల పనితీరు, అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అండర్ గ్రౌండ్ వర్క్ నిర్దేశిత సమయంలో పనులు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రవీంద్రసాగర్, ట్రైనీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్‌మావి ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

మోపాల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరును తెలుసుకునేందుకు శనివారం బోర్గాం(పి) సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్‌మావి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు సొసైటీ పరిధిలో ఉన్న రైతులే ధాన్యాన్ని తీసుకువస్తున్నారా లేక ఇతర గ్రామాల రైతులు ఇక్కడికి తీసుకువస్తున్నారా అనే దానిని ఆరాతీశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు నీటి వసతి, నీడ వసతిని కల్పించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రికార్డులను ఆమె పరిశీలించారు. అక్కడున్న రైతులతో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీసీసీబీ వైస్ ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, సొసైటీ పాలకవర్గం సభ్యులు, రైతులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో చట్టం చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు లత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 10న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ అమలుపై పోరాటం చేస్తున్న బీఎల్‌పీకి మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొలిశెట్టి, లాలు, జగదీశ్, చంద్రగౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కళ్యాణి

చట్టాలపై అవగాహన అవసరం

ధర్పల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అందరికీ చట్టాలపై అవగాహన అవసరమని ఎస్ఐ కళ్యాణి పేర్కొన్నారు. ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్ఐ కళ్యాణి సిబ్బందితో కలిసి మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పోక్సో చట్టంపై, షీటీమ్ ప్రాముఖ్యత, క్రిమినల్ చట్టాలలో మహిళలకు ఉండే హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చక్కగా చదివి తల్లిదండ్రులు గర్వపడే స్థాయిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

అమీన్‌పూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భార్యను భర్త హత్య చేసి సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని వడక్‌పల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం త్రయంబక్‌పేట గ్రామపరిధిలోని గండితండాకు చెందిన బోనోత్ రాజు(44) భార్య సరోజ(35)తో కలిసి అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లి శివారులోని ప్రసాద్ పొలంలో పనిచేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి భార్యాభర్తల మధ్య తగాదా ఏర్పడి వాదులాడుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాజు కర్రతో సరోజపై దాడి చేయడంతో అక్కడిక్కడే మృతిచెందింది. పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

గతంలోనూ భార్యపై హత్యాయత్నం

నిందితుడు రాజు గతంలోనే సరోజపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో 2023లో హత్యాయత్నం కేసు నమోదు అయింది. నిందితుడు రాజు 40 రోజుల పాటు జైలుకు వెళ్లి వచ్చాడు. తాను మారిపోయానని నమ్మించాడు. రాజు మాటలు నమ్మి కలిసి ఉండేందుకు సరోజ అంగీకరించింది. ఉపాధి కోసం ఆరు రోజుల క్రితం వడక్‌పల్లి గ్రామ శివారులో ప్రసాద్ అనే వ్యక్తి ఫాంహౌజ్‌లో కూలీలుగా చేరారు. అక్కడే తోటలో మకాం పెట్టారు. అర్ధరాతి మద్యం మత్తులో భార్యను దూషిస్తూ దారుణంగా దాడి చేసి హత్య చేశాడు. నిందితుడు రాజుకు డిచ్‌పల్లి మండలం బీబీపూర్ గ్రామానికి చెందిన సరోజతో 2005లో వివాహం జరగగా కుమార్తె వినోద (18), కొడుకు విశాల్ (16) పిల్లలు ఉన్నారు. వివాహం జరిగి రెండు దశాబ్దాలు గడచి కాలేజీకి వెళ్తతున్న పెద్ద పిల్లలు ఉన్నా భార్యభర్తల మధ్య సఖ్యత లోపించడం, భర్త మద్యానికి బానిసై భార్యను వేధించడం ఆగలేదు. చివరకు సరోజ భర్త చేతిలోనే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి తల్లి బడావత్ చంగీభాయ్ ఫిర్యాదు మేరకు నిందితుడు రాజుపై హత్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు.

జల కోలాటం..

(5వ పేజీ తరువాయి)

80 టీఎంసీల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు ఈఈ తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంజీరా నది వెంట వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో శనివారం నీటి పారుదలశాఖ అధికారులు ప్రాజెక్టు వీఆర్ నెంబర్ 5లోని ఐదు గేట్లు ఎత్తి దిగువ మంజీరాకు 45,135క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వారంరోజులుగా నిజాంసాగర్ ఎగువ ప్రాంతం నుండి వరద నీరు వస్తూనే ఉన్నప్పటికీ అధికారులు క్రమేపీన వరద గేట్లు ఎత్తి మంజీరా నదిలోకి నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం పూర్తి నీటిమట్టం 1405అడుగుల నీటి సామర్థ్యం ఉంది.

గల్ఫ్ ఏజెంట్లతో జాగ్రత్త

(5వ పేజీ తరువాయి)

లింకులను ఓపెన్ చేయవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకోవాలని తెలిపారు. దేశంలో పోలీస్‌లు తమ ప్రాణాలను పనంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని 190 మంది పోలీస్‌లు విది నిర్వహణలో అమరులు అయ్యారని అన్నారు. అనంతరం క్రీడ కారులకు క్రీడా దుస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ యూత్ అధికారి పవన్‌కుమార్, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎంపీవోలు రాజగంగారాం, నరేందర్, క్రీడా పోటీల కన్వీనర్ లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

15న స్పెషల్ లోక్ అదాలత్

(5వ పేజీ తరువాయి)

విజయవంతానికి కృషి చేస్తుందని తెలిపారు. న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు మాట్లాడుతూ న్యాయవాదులను, న్యాయమూర్తులను, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ న్యాయ వివాదాలను న్యాయార్థుల అభీష్టం మేరకు పరిష్కరించడం జరుగుతుందని అన్ని మండలాల్లో బెంచ్‌లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

అయ్యో దేవా..!

▸ అభివృద్ధికి నోచుకోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

▸ భక్తులకు అందని సౌకర్యాలు, దాతల విరాళాల నిరాకరణ

▸ తొలి ఏకాదశి రోజు కోనేరు గేటుకు తాళం

ఎడపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలో గల జానకంపేట శివారులోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఆలయానికి వచ్చే భక్తులకు కావలసిన అవసరాలను దాతలు సమకూర్చినా వాటి నిర్వహణలో అధికారులు విఫలమయ్యారు. తాగునీటి ఫ్రీజర్, మరుగుదొడ్లను నిరుపయోగంగా మార్చారు. కార్తీక మాసం, అందులో తొలి ఏకాదశి శనివారం రోజున అష్టముఖి కోనేరుకు తాళం వేసి ఉంచారంటే అధికారుల పనితీరు అర్థమవుతోంది. ఆలయాన్ని సాయంత్రం ఆరు గంటలకే మూసి వేయడంతో దూర ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు నిరాశతో వెనుదిరిగారు.



జానకంపేట ఆలయంలో పాడైపోయిన ఫ్రీజర్

మండలానికి చెందిన ఓ నాయకుడు గర్భగుడిలో ఏర్పాటు చేసేందకు ఏసీని విరాళంగా ఇస్తానని అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయ ప్రాంగణంలో టైల్స్ పగిలి ఎంతో మంది భక్తులకు గాయాలు అయినా వాటిని మరమ్మతు చేయడం లేదు. ఆలయంలో ఎన్నో సమస్యలు ఉన్నా ఆలయ ఈవో, కమిషనర్ తమకేమి పట్టనట్లు వ్యవహరిసున్నారు.

జానకంపేట శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో గల సమస్యల గురించి ఈవో వేణును వివరణ కోరగా త్వరలోనే అలయంలో గల తాగు నీటి ఫ్రీజర్‌ను బాగు చేయిస్తామని, గ్రిల్, టైల్స్ వేయిస్తామని, మరుగుదొడ్లకు నీటి వసతి కల్పించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు.



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న రజనీకాంత్

ప్రభుత్వ సలహాదారుకు శుభాకాంక్షల వెల్లువ

ఇందూరు, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సుదర్శన్‌రెడ్డిని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని సుదర్శన్‌రెడ్డి నివాసంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇందూరు : ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సుదర్శన్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జిల్లాకు చెందిన కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ రజనీకాంత్ ఘనంగా సన్మానించారు. జిల్లాకు మెడికల్ కళాశాల తీసుకురావడంలో సుదర్శన్‌రెడ్డి పాత్ర ఎంతో ఉందన్నారు.

బోధన్: నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బోధన్ ఏఎంసీ ఛైర్మన్ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ వసంత్‌రెడ్డి, నాయకులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, గణపతి రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రావు, కౌటిల్య, దాము, లయన్స్ క్లబ్ ప్రతినిధి బసవేశ్వర్‌రావు, ట్రస్మా జిల్లాధ్యక్షుడు కిషోర్ తదితరుల సుదర్శన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులను కాపాడుకోవడంతో పాటు అభివృద్ధి, సంక్షేమం కోసం కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారత కార్మిక సంఘ సమైక్య నగర అధ్యక్షుడు దేవరాజు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కూలీలు, కార్మికులు, హమాలీలకు పనిభద్రతతో పాటు ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి శివకుమార్, నీలం సాయిబాబా, నర్సింగ్‌రావు, శంకర్, వనమాల సత్యం తదితరులు పాల్గొన్నారు.

'నిశిత'లో హాల్లోవిన్ పార్టీ



జిల్లాకేంద్రంలోని నిశిత ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం హాల్లోవిన్ పార్టీ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ ఘోస్ట్ థీమ్‌లతో కూడిన వేషధారణలో తయారై వేడుకల్లో పాల్గొని అలరించారు. - ఇందూరు